క్లుప్తంగా

చేనేత హస్తకళా ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఆగస్టు 6 తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేక డిజైన్‌తో కూడిన బ్లాక్ ప్రింట్, చేనేత చందేరి, మహేశ్వరీ, కోసా, డ్రెస్ మెటీరియల్స్, పెయింటింగ్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలి

రాయదుర్గం: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ మంజూర్‌హుస్సేన్ సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, బేసిక్స్‌పై ఎక్కువ చర్చ సాగుతోందన్నారు. అందరూ వీటి వినియోగం ద్వారా ఎంతో ప్రగతిని సాధిస్తున్నారన్నారు. ప్రతి ఉద్యోగి, అధికారి ఇలాంటి సాంకేతికపరిజ్ఞానంపై అవగాహన ఉండాలన్నారు. ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఇలాంటి అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆధ్వర్యంలో ఏటా 300కు పైగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎస్కీ ఆధ్వర్యంలో ప్రస్తుతం ట్రెండ్‌కు అనుగుణంగా ప్రత్యేక కోర్సులను కూడా ఇక్కడ నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో టిక్ మహింద్రాహెడ్ బ్లాక్ చెయిన్ డెవలపర్ సాయిప్రశాంత్, డీఎస్‌టీ ప్రోగ్రామ్స్ నోడల్ ఆఫీసర్ సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫూ ఎంటర్‌టైన్‌మెంట్‌తో హార్న్‌బిల్ ఎంఓయూ

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంటర్‌టైన్మెంట్, మల్టీమీడియా సంస్థల అవసరాలను తీర్చటంపై తమ సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని హార్న్‌బిల్ స్టూడియోస్ సీఈవో శ్రీనివాస్ రాజు తెలిపారు. ఇందులో భాగంగా తమ సంస్థలోని ఉద్యోగుల సంఖ్యను 2024 నాటికి రెండింతలు చేయనున్నామని అన్నారు. నగరానికి చెందిన హార్న్‌బిల్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్, స్విట్జర్లాండ్‌కు చెందిన ఫూ ఎంటర్‌టైన్‌మెంట్ ఎ.జి సంస్థతో ఇటీవల అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. నగరంలోని ఫిలింఛాంబర్ వేదికగా నిర్వహించిన ఈ ఎంఓయూ కార్యక్రమంలో ఫూ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకులు, వరల్డ్ ఐకాన్ మైఖేల్ జాక్సన్ కొరియోగ్రాఫర్ క్రిస్ డీ, జీఎమ్ ఎజాజ్ మహమ్మద్, హార్న్‌బిల్ స్టూడియోస్ ప్రెసిడెంట్ శరత్ కొత్తపల్లి, ఎండి రవి కొత్తపల్లి పాల్గొన్నారు.

వీవీ ప్యాట్స్‌పై అవగాహన

హఫీజ్‌పేట్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు వీవీ ప్యాట్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఈవీఎంలతో వీవీ ప్యాట్స్‌ను అందుబాటులో ఉంచారు. ఓటర్లు ఎవరికి ఓటు వేస్తున్నారో వీవీ ప్యాట్స్ నుంచి వచ్చే స్లిప్ ద్వారా తెలుసుకోవడం కోసం అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలోని కాలనీలలో, బస్తీలలో, షాపింగ్ మాల్స్‌లో ఈ వీవీ ప్యాట్స్‌పై అవగాహన కల్పించనున్నారని అధికారులు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు ప్రజలకు వీవీ ప్యాట్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ శివరాంప్రసాద్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో 29వ తేదీ ఉదయం 8.30 గంటలకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డు నుంచి ప్రారంభమై ఆల్విన్‌కాలనీ, హుడా పార్కు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి మెయిన్ రోడ్డు, కూకట్‌పల్లి, మెట్రో గ్రౌండ్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. అనంతరం మెట్రో గ్రౌండ్‌లో ముగింపు సభ జరుగుతుందన్నారు. ఈ ముగింపు సభలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ శాంతియుత ర్యాలీలో పాల్గొనవలసిందిగా క్రైస్తవ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ కొమ్ము సాగర్, మాణిక్యం, ఆనంద్ తెట్టబావి, కొర్ని మోజస్, శామ్యూల్, జాషువా పుచ్చకాయల, ప్రసాద్, రమేష్, జాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఇళ్లలోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ముంపు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటన
- పక్కా నాలా పనులు మొదలెట్టాలని ఆదేశం
- అవసరమైన చోట కల్వర్టు నిర్మించాలని సూచన


అల్లాపూర్ డివిజన్‌లో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్, బాలాజీనగర్ డివిజన్‌లలో శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సఫ్దార్‌నగర్ నాలా పక్కన నివసిస్తున్న ఇళ్లలోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులకు పక్కా నాలా పనులను త్వరలో మొదలు పెట్టాలన్నారు. అవసరమైన చోట కల్వర్టులు నిర్మించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

కూలిన ప్రహరీ పరిశీలన..

బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్‌లోని పార్కుకు అనుకొని ఉన్న ప్రహరీ కూలిన విషయం విదితమే. శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పక్కనే ఉన్న అపార్టమెంట్ వాసులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మమత, ఎంఆర్‌ఓ గోవర్ధన్, డీసీ రమేష్, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్ సబిహా బేగం, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయనగర్‌లో కూలిన పార్కు ప్రహరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు


కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులకు పాదయాత్ర వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఆగస్టు 1 నుంచి ప్రజల వద్దకు వెళ్తున్నా..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు.

◆ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లలో నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 95శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భూగర్భ పైపులైన్ల ద్వారా వరద నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

◆ ఒకప్పుడు చిన్నపాటి వర్షానికే మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచేదన్నారు. ఈ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కారణంగా ముంపు తీవ్రత చాలా వరకు తగ్గిందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలను కూడా తట్టుకోగలిగామని పేర్కొన్నారు.

◆ ఇవన్నీ ప్రజలకు తెలియచెప్పే బాధ్యత మనపై ఉందన్నారు. సంక్షేమ పథకాల విషయంలో తెలంగాణ రాష్ట్రం ఏ స్థాయిలో ఉందో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వారి వద్దకే వెళ్లి తెలుసుకుంటానన్నారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఏమైనా సమస్యలు ఉంటే ఈ పాదయాత్రలో తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ముంపు ప్రాంతాల్లో జెడ్‌సీ పర్యటన

- సహాయక చర్యలపై ఆరా


గురుగోవింద్ సింగ్‌నగర్‌లో వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ మమత

ఆల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని గురుగోవింద్ సింగ్ నగర్‌కాలనీ నీట మునిగింది. ఈ సందర్భంగా శుక్రవారం జోనల్ కమిషనర్ మమత కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. ఎస్‌ఐ శ్రీకాంత్, మాన్‌సూన్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ చేపడుతున్న సహాయక కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ముంపు బాధితులకు ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఏఐ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, యాదగిరి, సంగమేష్, పోశెట్టి గౌడ్, వాసుదేవరావు, మారుతి, రాజు, పద్మయ్య సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

జెమ్ మోటార్స్ సర్వీస్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని జెమ్ మోటార్స్ మారుతి సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. సర్వీస్ సెంటర్‌లోని పెయింటింగ్ సెక్షన్‌లో కార్లకు పెయింటింగ్ వేసేందుకు ఉపయోగించే కంప్రెషర్ పేలి మంటలు చెలరేగడంతో పొగలు సర్వీసింగ్ సెంటర్ మొత్తం వ్యాపించాయి. అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక పరికరాలతో ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో కూకట్‌పల్లి అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని జెమ్ మోటార్స్ సిబ్బంది తెలిపారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి యాగం



మోతీనగర్: యజ్ఞ హోమాలతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని భరద్వాజ శ్రీవిద్యా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణుభట్ల లక్ష్మీనరసింహ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నల్లమాల్పు అంజిరెడ్డి ఆధ్వర్యంలో నవ చండీ మహారుద్ర యాగ సహిత మహాలక్ష్మీ యాగాన్ని ఘనంగా ప్రారంభించారు.

వరద బాధితులకు రూ.10వేల పరిహారం ప్రకటించాలి



జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడిలో పాల్గొన్న గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, నాయకులు

కూకట్‌పల్లి: వరద బాధితులను జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు, అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, నాయకులు శుక్రవారం కార్యాలయ ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం వరదల్లో చిక్కుకుపోయిన బాధితులకు సాయం అందించడంలో జీహెచ్‌ఎంసీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం ఏమీ చేస్తోందని ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ముందు వరదలు వస్తే బాధితులకు రూ.10వేలు ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడెందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. వరదలతో నష్టపోయిన వారికి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత వారం రోజులపైగా కురుస్తున్న వర్షాలకు దినసరి కూలీలు, అసంఘటిత కార్మికులు ఉపాధి లేక అల్లాడిపోయారన్నారు. వెంటనే వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు రూ.10 వేల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కర్యాక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ జరిపేటి జైపాల్, నాయకులు మారెళ్ల శ్రీనివాసరావు, యాదగిరి, జహంగీర్, రాజేంద్ర, పోచయ్య, కవి సన్యాసిరావు, శేఖర్, సుజాత రాజన్, గోపిశెట్టి రాఘవేందర్ తదితరులుపాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


అంబీర్‌చెరువు ఔట్‌లెట్ స్థితిగతులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భాగ్యనగర్‌కాలనీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పర్యటించారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ అంబీర్‌చెరువు ఔట్‌లెట్ స్థితిగతులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఔట్‌లెట్ ద్వారా వెలువడతున్న నీటి ప్రవాహం ద్వారా చెరువు దిగువన ఉన్న కాలనీలు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ఇరిగేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తూమును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. మాన్‌సూన్, ఎమర్జెన్సీ టీమ్స్ అన్ని పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ విశ్వం, నాయకులు జోగిపేట భాస్కర్, జోగిపేట బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

మూసాపేట: రాష్ట్ర బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు డివిజన్‌లోని వడ్డెర బస్తీ, జనతానగర్‌లలో శుక్రవారం కార్పొరేటర్ మహేందర్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బస్తీ బాట ద్వారా బస్తీల్లోని సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలిపి తక్షణమే పరిష్కరించాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మనోహర్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ వినోద్, పోలాకి కిషోర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బీజే వైఎం డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.


మూసాపేటలోని ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేందర్

ఇలా ఉంటే ఎలా..?

- అండర్‌బ్రిడ్జి పరిస్థితి గురించి ప్రశ్నించిన విజయశాంతి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద 15 ఏళ్ళుగా పరిస్థితి ఇలా కొనసాగుతుంటే అభివృద్ధి చేశామని చెబితే ఎలా? అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. శేరిలింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పరిస్థితిని ఆమె శుక్రవారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్న వర్షం పడితే రాకపోకలు ఆపివేయడంతోనే ఏటా గడుపుతున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే వాహనాల రాకపోకలు నిలిపివేస్తే, ఇక మనుషుల సంగతి ఏమిటని ఆమె ప్రశ్నించారు.15 ఏళ్ళుగా ఈ సమస్యను పరిష్కరించక పోవడం వారి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యోగానంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్లలోకి నీరు చేరినా పట్టించుకోకపోవటం సిగ్గుచేటు


ఆల్విన్‌కాలనీలోని సిక్కుకాలనీలో పర్యటిస్తున్న బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొరదాల నరేష్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: ప్రజల గోస పట్టించుకోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత వారం రోజులుగా వర్షాలు పెద్ద ఎత్తున వస్తుంటే, పేద ప్రజల ఇళ్లు, బస్తీలు మునిగిపోతున్నా.. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు ఏమీ చేయకుండా ప్రకృతి వైపరీత్యం వచ్చినప్పుడు ఇది సహజమని చెప్పడం సిగ్గుచేటని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ సిక్కుల బస్తీలో మునిగిన ఇళ్లను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొరదాల నరేష్, నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ఏమీ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. రెండు సంవత్సరాల క్రితం వరదలు వచ్చినప్పుడు ఎమ్మెల్యే గాంధీ సిక్కుల కాలనీలో నీళ్లు రాకుండా మూసీలోకి మళ్లిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే హామీలు నీటి మూటలని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులకు అధికారం మీద ఉన్న వ్యామోహం, సేవ చేద్దామనే ఆలోచన లేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చి ముంపు సమస్యను పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రవీందర్‌రావు, జానకి రామరాజు, కమలాకర్‌రెడ్డి, కుమార్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సహాయక కార్యక్రమాల్లో నేతలు, సామాన్యులు

మోతీనగర్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అల్లాపూర్‌లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు విమర్శించారు. సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లలో శుక్రవారం ఆయన పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య పునరావృతం అవుతోందన్నారు. అయినా అధికారుల్లో ఏ మాత్రం చలనం రావడం లేదన్నారు. అనంతరం ముంపు బాధితులకు నిత్యావసరాలు, ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అమ్రేష్ రాజు,విజయ్,వినోద్, గురుప్రసాద్, శ్రావణ్, అంకిత్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


అల్లాపూర్ డివిజన్‌లో నిత్యావసరాలను అందజేస్తున్న మాధవరం కాంతారావు, బీజేపీ నేత

◆ **మూడు పూటలా ఆహారం అందిస్తూ..**

అకాల వర్షాలకు ప్రతిరోజు రాజీవ్‌గాంధీనగర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కొమ్ముల రమేష్ మూడు పూటలా అల్పాహారం, ఆహారాన్ని ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. అదే విధంగా సఫ్దార్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హమీద్ ప్రతి రోజూ లోతట్టు ప్రాంతాల్లో అల్పాహారం, భోజనాన్ని అందించారు.


సఫ్దార్‌నగర్‌లో ఆహారాన్ని పంపిణీ చేస్తున్న సంఘం అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హమీద్

◆ **కాంగ్రెస్ ఆధ్వర్యంలో...**

సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లో శుక్రవారం కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, బీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ బాధితులను పరామర్శించి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటి వరకు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు సమస్యలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అజీమ్, నర్సింహ యాదవ్, పల్లపు వేణు, సంతోష్‌కుమార్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నిత్యావసరాలు, దుప్పట్లు, మందుల పంపిణీ**

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లోని సిక్కులకాలనీలో వరద నీరు చేరడంతో ఇళ్లలోని నిత్యావసరాలన్నీ తడిసి ముద్దయ్యాయి. ఇది చూసి చలించిన సిల్వర్ మనీష్ కుమార్ శుక్రవారం ముంపు బాధితులను పరామర్శించారు. వారి సమస్యలు తెలుసుకుని అల్పాహారం అందజేశారు. తనకు తోచిన సాయంగా నిత్యావసరాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.


సిక్కుల కాలనీలో నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న మనీష్‌కుమార్